# మధ్యవర్తి

జైరాజ్



మధ్యవర్తిత్వం అనేది విధిగా కొన్ని సందర్భాల్లో ఉండి తీరాలి అనే సత్యాన్ని రసాయనిక శాస్త్రంకూడా నిరూపిస్తూ ఉంది. రెండు పదార్థాలు మేము ఒకదానితో ఒకటి కలవం మొర్రో అని మొండికెత్తిన సందర్భాల్లో శాస్త్రజ్ఞుడు మూడో పదార్థాన్ని మెల్లిగా వాటి మధ్యకు నెట్టి, అవి రెండూ కలిసేలాగ చేసి దీన్ని బయటకు లాగాడు. సంధి కుదిర్చి మొదటి పదార్థం మెరుగుగానీ, రెండోదాని రంగుగానీ అంటించుకోకుండా నికార్సయిన మూడో పదార్థంగానే అది దిగబడింది. దీనికి ''కేటలిస్ట్'' అని నామకరణం చేయబడింది. దళారీ వ్యాపారంలోలాగా ఇరుపక్కాల్ని కొంచెం కొంచెం కరిగించి కడుపులో పోసుకున్నబాపతు కాదిది. మధ్య

మారినందుకు నష్టపోయిన బాపతూ కాదు. సింపుల్ ఇయార్క్సరీ ఏజెంట్.

నాకు హోంవర్కు మేటపడిపోయిందని పెద్దదీ, నాకు పరీక్ష ఒకటి తగలడిందని చిన్నదీ, తలోక బలీయమైన కారణాన్ని చూపిస్తూ అప్పచెల్లెళ్ళిద్దరూ ఇళ్ళువాకిళ్ళు తుడవవలసింది, ఇవాళ్టికి చస్తేనంపేనువ్వేననుకొంటూ వాదులాడుకొంటూంటే, తెలివైన తండ్రి మధ్యన తలదూర్చి "ఎందుకువచ్చిన తగవర్రా, నేను ఊడ్చిపారేస్తా లెండి" అంటూ లేచే సరికి, ఒకర్తె అందుబాటులో ఉన్న చీపురుకట్ట అమాంతంగా అందుకొంటే, రెండవది పరుగున వెళ్ళి ఈనెలకట్ట తెచ్చుకొంటే ఇళ్ళువాకిళ్ళు తుడవడం చిటికెలో ముగిసిపోయింది. చక్కని ఊహ కో ఉదాహరణ. చక్కని పరిష్కారం. ఇదే కేటలిస్ట్ చేసే పని.

మొదట్లో సత్యారావు తన సంపాదనలో బొటాబొటిగా సరిపెట్టుకు వచ్చాడు. కొంతసొమ్ము కూడబెట్టుకోవాలనే ఆశతో ఇంతో, అంతో వెనకవేసుకోవాలని తాపత్రయ పడ్డాడుగాని సాధ్యపడలేదు. గుమాస్తాకి వచ్చే దెంత? . . . అందులో మిగిలేదెంత? పాసింజరు ప్రయాణంలాంటి బ్రతుకు. ఇంతో, అంతో లేటు పెరుగుతుండేగాని టైమ్ కలపడం కల్ల.

మెయిల్ అడ్డువచ్చేసరికి పాసింజరు లూప్‌లైన్‌లో అపివెయ్యబడ్డట్టు తాయారమ్మ పురుడు ఎదురువచ్చేసరికి సత్యారావు జీవనప్రయాణం లూపులైనులోకి మళ్ళింది.

ఇప్పుడు సత్యారావు ప్రయాణం ఒక నెల లేటు! ఎక్కడి కక్కడ అరువులూ, ఖాతాలూ; నెల తిరిగేసరికి బాకీలు నివాడా చేసెయ్యడం, పద్దుమీద సంసారం నడవడం.

రెండు నెలలు లేటు! మూడు నెలలు లేటు! అప్పుల గుయ్యారంలో డిరేయిల్డ్ బాపతులుకూడా తన గ్రూపులో ఉన్నారేమో! అటువంటి తీవ్ర పరిస్థితి తనకు రాకుండా ఉండగలందులకై ఎంతో జాగ్రత తీసుకొంటూ అదనంగా దేవుళ్లను ప్రార్థించేవాడు కాపాడమని సత్యారావు.

ఫస్టు తారీఖున పెండింగు ఫైల్సు చాటేసుకుని పాకెట్ నోట్‌బుక్ తెరిచి బేలన్సుషీటు వేస్తున్నాడు సత్యారావు.

రిసీట్సు కాలంకింద ఒక్కటే ఒక అంకె పడింది — జీతం!

పేమెంట్సుకింద కిరాణాకొట్టు బాకీ, ఇంటద్దె, పాలబాకీ వగైరా పెద్ద పద్దులతో ప్రారంభమయి, పేజీ తిరిగి రెండో పేజీ అడుగున గుర్తువచ్చిన చేబదుళ్లతో ముగిసింది లిస్టు. కూడిక పూర్తిచేసేసరికి సత్యారావు ప్రాణం విలవిల్లాడిపోయింది. ఎడంపక్క మొత్తంకంటే పెద్ద అంకె వచ్చింది!

కూడికలో ఏదైనా పొరపాటేమో, మళ్లీ కూడి చూస్తే ఏమైనా మిగలవచ్చేమోనని, ఆశతో తిరిగి కూడితే మరో మూడు రూపాయలు పెరిగి కూర్చుంది ఖర్చు! అది అంతా పదిహేను రూపాయలు తేలింది! అంటే రొండు చేశాడు లెండి గుమాస్తాగనక.

'ఎలాగు? . . . ఎలాగైంది అదనపు ఖర్చు? . . . ఎంతో జాగ్రత్తగా గడుపుకువస్తున్నా సంసారం ఎందుకిలా గయింది?' అని లోలోపలే వాపోతూ ఖర్చుల జాబితా సింహావలోకనం చేయ నారంభించాడు.

అప్పుల పట్టికమీద జరుగుతున్న చూపుడువేలు అయిదు రూపాయల అంకెమీద నిలిచింది. దాని కెదురుగా వివరాలలో "రామ్మూర్తిగారివద్ద పుచ్చుకొన్న చేబదులు" అని వ్రాసిఉంది. 'ఎందుకు చేశాను చెప్మా ఈ చేబదులు?' అని యోచించేసరికి గుర్తువచ్చింది తాయారుకి నాలుగురోజులపాటు మలేరియాజర్వం కాస్తే, మందిప్పించింది ధర్మాసుపత్రిలోనే అయినా, ఇటూ అటూ తిప్పట రిక్షాలోనే జరిపించవలిసివచ్చింది గాన చేతిలో రొక్కం లేక చేబదులు తెచ్చాడు. సరే. . . అయిదు.

వేలు మళ్లీ నడక సాగించింది. చాకలి జీతాని కెదురుగా మళ్లీ నిలబడింది. సంగతి గుర్తుకువచ్చింది సత్యారావుకి. పండుగ వెళ్లి మూణ్ణెల్లయినా, చాకలికి, మంగలికి, తోటీకి, ఆఫీసు బంట్రోతులకీ పండుగ మామూలు ఇవ్వలేకపోయాడు తాను. మూడు మాసాల నుండీ సతాయించుకు తింటున్నారు వాళ్ళు. అందుకని పద్దుకి ఒకటీ రెండు చొప్పున అదనంగా ఖర్చు రాశాడు! అదీ సంగతి! ఇదొక తొమ్మిది రూపాయలదాకా తేలింది.

'ఇది తగ్గించిపారేస్తేనో? కుదరదే! . . . ఎందుకు కుదరదుగాని మళ్లీ నెలరోజులపాటు పీడాకరం. ఒక శక్తిగాదాయె, ఐదారుశక్తులు' నిట్టూర్చాడు.

మొత్తం ఖర్చులో సగం తగ్గించి పారేశాడు. ఇంతకీ తగ్గింది ఎంత? నాలుగున్నర. ఇంతలో చటుక్కున గుర్తువచ్చింది. పాలమ్మికి ఎక్స్ట్రా పాలకి సరీగ్గా నాలుగున్నర ఇవ్వాలాయె. తాయారు జ్వరంలోనూ, అప్పైన మరో రెండు రోజులూ బుజ్జిగాడి కోసం వేరేగా రోజు కో అర్థ సేరు పాలు తీసుకున్నారాయె. అది వ్రాయడం మర్చేపోయాడు. ఇంత కష్టపడి సింహావలోకనంచేస్తే మిగిలింది సున్నకి సున్న, హళ్ళికి హళ్ళి!

మీటర్ రెండునెలల లేటులో ప్రవేశిస్తున్నట్టు సూచన చేస్తూంది.

అదిరిపడ్డాడు సత్యారావు. 'లాభంలేదు. ఈ నెల ఎవర్నో ఒకర్ని బ్రతిమాలి కొంత బాకీ కురదా ఉంచేసి, కొంత ఖర్చు తగ్గించో లేక కడుపు కుట్టుకునో ఖర్చు వేగం తగ్గించాలి' అనుకొన్నాడు.

'ఎవరికి కురదాపెట్టడం? షావుకారు ససేమిరా ఒప్పుకోడు. ఇంటాయన ఈవేళ గుమ్మంలోనే ఎదురౌతాడు. పాలమ్మో? అయ్యబాబోయ్, అసిరమ్మ! . . . ప్చ్!' నిట్టూర్చాడు సత్యారావు.

"సార్, సంతకం పెట్టండి" అంటూ డబ్బు గల కవరు ముందు పడేసి ఎక్విటెన్స్‌రోలు ఎదురుగుండా పెట్టాడు జవాను సన్యాసి.

సత్యారావు సంతకం పెడుతూంటే, "బాబూ, నాది నాకు పడెయ్యరా?" అన్నాడు సన్యాసి.

మారు మాట్లాడకుండా కవర్లోనుంచి ఒక రూపాయి తీసి ఇచ్చాడు సత్యారావు.

"ఇదేటి బాబూ, రెండన్నా ఇవ్వరా?"

"లేదోయ్, అంతకన్నా ఇవ్వలేను" అనేశాడు సిగ్గు విడిచి.

"పోనీలే, బాబూ" అంటూ అసంతృప్తి ప్రకటిస్తూ సన్యాసి వెళ్లిపోయినా అదేమాట తనపై జాలిదలిచి అన్నట్టుగా వినిపించింది సత్యారావుకి.

మిగిలిన ఇద్దరు బంట్రోతులు వచ్చి తలో రూపాయి వడుక్కున్నారు.

నోట్లకేసి విచారంగా చూశాడు సత్యారావు. అవి తనవి కావు. తనకేమీ తెచ్చిపెట్టవు.

ఉత్తరానికై ఎదురుచూసేవాడికి పోస్టుమాను చేతిలో కట్ట తృప్తి ఇస్తుందా, అందులో తనకి కావలిసింది లేనప్పుడు?

రోజూకంటే పెందలాడే ఆఫీసు వదిలాడు సత్యారావు అందరితోపాటే. ఉత్సాహంగాకాదు, ఊపిరాడక సతమతమవుతూ. పదిహేను రూపాయలు - ఎలాగ సర్దుబాటు చేసుకోవడం? అన్నదే అతని సమస్య!



'ఒకదానిమీద ఒకటి'
ఫోటో—టి. చిత్ర (మద్రాసు-14)

పెద్ద ప్రాబ్లమ్.

ఖాతాలు తీర్చిన దగ్గిర కొంచెం నసిగి చూశాడు, ఐదో పదో తగ్గించి ఇస్తానని. లాభంలేదని కొందరు మర్యాదగా చెప్పారు. కొందరు కఠినంగా చెప్పారు. అయ్యరయితే అణాపైసలతో సొమ్మక్కడే పెట్టమంటూ గదిమాడు. పాపం, సత్యారావు ఉసూరుమన్నాడు.

గుమ్మంలోనే ఇంటిఅద్దె చెల్లించి ఇంట్లో అడుగు పెట్టాడు. జేబులో మిగిలినవి ఇక పాతిక రూపాయలే. తీర్చవలిసిన బాకీ ఇంకా నలభై రూపాయలు.

ఒక్క ఎలక్ట్రిక్ బిల్లు మూడు రూపాయల పదిహేను పైసలుతప్ప తతిమ్మావన్నీ తెల్లారేసరికి తీర్చవలసిందే. అందులో పెద్దమొత్తం అసిరమ్మ బాకీ. ఎక్స్ట్రాలు కలుపుకుని పాతిక రూపాయలు.

"వచ్చేరా? పిల్లా డెందుకో మధ్యాహ్నంనుండి నలతగా ఉన్నాడండీ" అంటూ ఇంపార్టెంట్ న్యూస్ ఎనౌన్సు చేసింది తాయారమ్మ.

"నా పని అల్లాగే ఏడిసిందిలే" అనేశాడు ఆ వార్తకేమీ ప్రాముఖ్యం లేదన్నట్టు.

అర్ధరాత్రివేళ కుదిపి లేపుతూ బెక్కుతూ అంటూంది తాయారు, "సాయంత్రమే చెబితే చెవిని పెట్టారుగారు. చూడండి, పిల్లా డెలాగై పోతున్నాడో? పళ్ళు కరిచి పెట్టేశాడు. గుడ్లు తేలేస్తున్నాడు... ఇంకెక్కడి నా బాబే. ... నా దేవుడోయ్! ..." శోకంలోకి దిగిపోయింది ఏకంగా.

బాబుని చూసి హడిలిపోయాడు సత్యారావు.

"గాభరాపడకే. ఇప్పుడే డాక్టర్ని తీసుకొస్తాను" అంటూ షర్టు తగిలించుకొని పరిగెట్టాడు.

కంప్లైంటు గూర్చి విన్నాక పాతిక రూపాయలు అక్కడ పెడితేగాని కదలనన్నాడు డాక్టరు.

బాకీలమాట గుర్తున్నా, బుజ్జిగాడు మనసులో మెదులుతూ ఆందోళనపరుస్తున్నందున జేబులో ఉన్న పాతికా అక్కడ పెట్టి డాక్టరుగారి రెండు చేతులూ పుచ్చుకొని ఖంగారుతో "ఇవి కాళ్ళుకాదు చేతులనుకోండి" అనేశాడు సత్యారావు.

వరసగా మూడు ఇంజక్షనులు ఇచ్చి "మరేం ఫర్వాలేదు. రేప్పొద్దున్న ఎనిమిదింటికల్లా స్పృహ వచ్చేస్తుంది. ఈ జబ్బు లక్షణమే అంత. పొద్దుట వచ్చి చూస్తాను" అన్నాడు డాక్టరు.

"ఇంతకూ ఇదేమిటంటారు, డాక్టర్?" ఆదుర్దాగా అడిగాడు సత్యారావు.

"ఖంగారులేదు లేవయ్యా, రేపు పొద్దుటే వచ్చి చూస్తానన్నానుగా" అనేశాడు డాక్టరు.

డాక్టర్ని దిగబెట్టివచ్చి పిల్లాణ్ణి చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే ఉన్నాడుగాని ముఖం అదోలాగున్నట్లనిపించింది. తాయారమ్మకి నాలుగు మాటలు ధైర్యం చెప్పి మంచంమీద మేను వాల్చాడు. పడుకున్నాడుగాని నిద్ర పట్టద్దూ! ఆరోగంటకల్లా అవతరిస్తుంది పాలమ్మి. డిమాండు నోటీసు జారీచేస్తుంది. ఏమని సమాధానం చెప్పాలి?

ఇక్కడ పాలమ్మిని గురించి ప్రత్యేకంగా కొంచెం చెప్పవలిసి ఉంది. పేరు అప్పలమ్మ. పైజా కొండమ్మ. వయసు సొగసుమీరింది. నాజూకు లేనేలేదు. అందుకని జాకెట్టు ఉండనేఉండదు. అలంకరణ మెళ్ళో పట్టెడ, పైన కంటె. చెవులకి దుద్దులు. ముక్కుకి నత్తు. ఆపైన అడ్డపూస. చేతికి మురుగులు, కాళ్ళకు కడియాలు, కాలివేళ్ళకు మట్టెలు. ముత్తైదువేమో, నొసట కాసంత బొట్టు. తట్టలో పాలముంతలు పేర్చుకొని రెండు చేతులూ నెత్తిమీద తట్ట కాస్తుంటే, బరువుగా అడుగులు పడుతుంటే, మోచేతినుండి గూడుదాకా సడలిన కండరాలు గంగడోళ్ళలాగా ఊగుతూంటాయి. ముఖం ఎల్లప్పుడూ తుమతుమలాడుతూంటుంది. ఎవరైనా బాకీ పూర్తిగా ఇవ్వకపోయారా, చూడండి తడాఖా! ఒక్క పిసరు మర్యాద ఉంచదు. పైగా, ఆమె మాటల్లో "దగుల్బాజీ", "గుడిసేటీ" లాంటి పదజాలం దొర్లుతూంటుంది. శ్రుతిగాని మించిందా బూతులకేమీ కొదవ ఉండదు.

వెనకోసారి పక్కింటివాళ్ళని రేవెట్టి వచ్చింది అప్పలమ్మ. సత్యారావు ఇంటికి వచ్చినా ఇంకా పొగలు కక్కుతూనే ఉంది.

"పోనీలే, అప్పలమ్మా, ఏదో ఇబ్బందిలో ఉండి ఇవ్వలేకపోయారు కాబోలు. మళ్ళీ నెల్లో ఇచ్చేస్తారుగా. దాని కింత రాద్ధాంతమెందుకూ?" అన్నాడు సత్యారావు మాటవరసకి.

"మా చెప్పొచ్చావులేవయ్యా గడుసుకబుర్లు! ఇంతేసి ఇళ్ళూ, అంతేసి సోకులూ, ముప్పొద్దులా వణ్ణాలూ తినేటోళ్ళకి నా కివ్వాల్సిందే నోటొచ్చిందా? గడికి రిచ్చా, పూటకి సినేమా అంటూ నెల పొడుగునా మళ్ళీ దుబారా చేత్తానే ఉంటారు. ఆళ్ళ సరదాలకి నోటొచ్చిందని ఇడుకున్నారు గావును. ఇడుకోనీ... ఇడుకోనీ ... ఈ పాలి చెప్తా ఆళ్ళ పని. ఆల్లా సేలగాని నీ సొమ్ము నెక్కెట్టేయ్!" అంటూ దులిపేసింది.

నాలిక కరుచుకున్నాడు సత్యారా వప్పుడు.

'రేపెలా అప్పలమ్మని సాగనంపాలి? ... రేపొక్క రోజుకి జీతం ఇంకా అందలేదని అబద్ధమాడేసి ఏ కాబూలీవాడిదగ్గరైనా అప్పుచేసి అవాంతరం గడుపుకోవా'లనుకున్నాడు సత్యారావు.

ఒక్క చిన్న ఆపద వస్తే బ్రతు కెంత అల్లకల్లోలమయింది! మిగిలిన రాత్రి అంతా అతనికి నిద్రే పట్టలేదు.

"అమ్మోయ్! ... పాలు ... "బు, సత్తేరావ్వూ, బటువాడ జెయ్యవా?" అప్పలమ్మ కేక.

"నిన్న జీతం అందుకోలేదు, పాలమ్మా. ఇవేళ అందుకుంటాను. రేపిచ్చేస్తానులే" అని జంకుతూనే అన్నాడు సత్యారావు బయటికి వచ్చి.

"అలాగే కానీలే, బాబూ. ఇప్పుడి కిప్పుడు తొందరేటొచ్చింది?" అంటూ తట్ట ఎత్తుకు వెళ్ళిపోయింది అప్పలమ్మ.

"అమ్మయ్య! ఈ వేళ్టికి గండం గడిచింది" అనుకొన్నాడు సత్యారావు.

పిల్లవాడు ఇంకా స్పృహలోకి రాలేదు. భార్యాభర్తలిద్దరూ ఆందోళనపడుతూనే ఉన్నారు.

ఆ గుమ్మం, ఈ గుమ్మం తిరిగి చిట్టచివరికి రామ్మూర్తిగారి ఇంటికి వెళ్ళి పాలు పోసి తిరిగి వెళ్ళిపోతున్న అప్పలమ్మని రామ్మూర్తి కేకేసి, "ఏం అప్పలమ్మా, నిన్న ఫస్టు గదా ఈవేళ డబ్బు లడగలేదేం?" అంటూ పైకం చేత బెట్టాడు లోలోన ఆశ్చర్యపోతూ.

సత్యారావుదీ, ఇతనిదీ ఒకే ఆఫీసు కనక సత్యారావు

సాటి లేని థంబ్-గ్రిప్
మరియు ప్రసిద్ధికెక్కిన
ఏంఖిల్-గ్రిప్ గల
టూత్ బ్రష్
ఇది మాత్రమే
పళ్లను చాల బాగుగా శుభ్రపరుస్తుంది.
చాల ఎక్కువ కాలము మన్నుతుంది
స్టాండర్డ్, డిలక్స్ మరియు సూపర్ క్వాలిటీలో హార్డ్, మీడియమ్ మరియు సాఫ్ట్ గ్రేడ్స్‌లో లభిస్తుంది.
బేబీ మరియు జూనియర్ సైజులలో కూడ లభిస్తుంది.
ముఖమల్ వలె మెత్తగా నుండుటకై ప్రత్యేకంగా తయారుచేయబడి, శ్రద్ధతో ఎంచబడిన అతి మేలు రకపు నైలాన్ నుండి సూపర్ మరియు డిలక్స్ టూత్ బ్రష్‌లు తయారు చెయ్యబడినవి.

ఆర్యన్
సాటిలేనివి




Aryan

పనితనమునకు, నాణ్యతకు నమ్మకమైన గుర్తు!

మాట నమ్మి అప్పలమ్మ అడగలేదు. పాపం, రామ్మూర్తి కేం తెలుసు ఆ సంగతి.

సొమ్మ తెక్కచూసుకొంటూ తెలివిగా అడిగింది: "బాబూ, సత్తేరావుబాబుక్కూడా జీతమందిందా? నానింకా అటుకేసి ఎళ్లేలేదు."

"అందింది" అని రామ్మూర్తి అనడం తరవాయి అక్కడే సివాలెక్కింది అప్పలమ్మ.

"గుడిసేటిమాట్లూ, ముండా అబద్ధాలూ ... థూ ... ఏం మడుసులీళ్ళు ... ఉండు, చెబుతా" అని చిందులు తొక్కుకుంటూ వెళ్లిపోయింది.

రామ్మూర్తి పాపం, నిలువుగుడ్లేశాడు సంగతి తెలీక.

రుసరుసా వచ్చిన అప్పలమ్మ సత్యారావు గుమ్మం లోనే ఆగిపోయింది. లోపలినించి తాయారమ్మ ఏడుపు హెచ్చుస్థాయిలో వినపడుతూ ఉంది. సంగతేవిటో చెప్మా అనుకొని గుమ్మంలోనే నిలబడి ఆలకిస్తూంది అప్పలమ్మ.

"డాక్టర్, నా మాట నమ్మండి. పాలమ్మికి ఇవ్వవలసిన పాతికరూపాయలూ మీ చేతిలో రాత్రే పోశాను. ఇంక నాచేత చిల్లిగవ్వ లేదు. ఇంకా కొన్ని చిల్లరబాకీలు అలాగే ఉండిపోయాయి. ఇప్పుడిప్పుడే మళ్లీ యాభై రూపాయలిమ్మంటే నే నెక్కడినుంచి తెచ్చేది? కనికరించండి. పిల్లవాడి ప్రాణాలు నిలబెట్టండి. ఎలాగో పాలమ్మికి భయపడి సాయంకాలంలోగా కాబూలీవద్ద నన్నా బాకీ తెద్దామనుకుంటున్నాను. అక్కడే మరో యాభై రూపాయలు తెచ్చి సాయంత్రానికల్లా మీ కిచ్చేస్తాను. ఆలస్యం చేయకండి. ప్లీజ్ ... ఆ కోర్సేదో వెంటనే ఇప్పించండి. పసివాణ్ణి కాపాడండి. మీకు పుణ్యం ఉంటుంది. నేను పేదవాణ్ణి, డాక్టర్. ఇంత కన్నా మీకేం చెప్పగలను? ... డాక్టర్ ... ప్లీజ్."

"లాభంలేదు, మిస్టర్. ఇది చాలా సీరియస్ కేస్. తీరా మోసి పసివాడు దక్కకపోతే నా డబ్బుకి ఆశ వదులుకోవాలి. మందులు నా జేబులోనివటయ్యా? ఎక్కడో ఒకచోట సొమ్ము చూసి ఇస్తేనా, కేస్ టేకప్ చేస్తాను. గంటలోపల నీవు సిద్ధపడితే సరి. లేకుంటే ఆ తరవాత నా వద్దకు వచ్చినా ప్రయోజనం ఉండదు."

"మీ రలాగంటే ఎలాగ, బాబూ. మామీద గాక పోయినా ఆ పసివాడిమీదైనా జాలి దలచరేరా?" అంటూ బావురుమన్నది తాయారమ్మ.

"మీ రింత కఠినులనుకోలేదు, డాక్టర్! చెప్పవలసిందంతా నిజమే చెప్పాను. మీరు నమ్మటంలేదు. మీ దయ" అంటూ చేతులు జోడించాడు సత్యారావు.

"ఏందుకయ్యా, ఆ దణ్ణాలూ దాసిళ్లూ? ఇదుగో నయ్యా ముండాడబ్బు. మడిసన్నాక మంచీ చెడ్డా ఉండద్దా ఆపాటి? ఆ ఇంజీసనేదో నానుండగానే ఇచ్చి పిలగాణ్ణి బతికించు" అంటూ గలగల్లాడుతూ గదిలో ప్రవేశించి బొడ్డుకొంగులోనుంచి డబ్బు తీసి డాక్టరు చేతిలో కుక్కింది అప్పలమ్మ.

ఈ హఠాత్పరిణామానికి గదిలో ఉన్న ముగ్గురూ నిర్ఘాంతపోయారు.

"అలా కళ్ళు తేలేసి చూత్తావేటయ్యా? నీ పనేదో నువ్వు కానియ్యవయ్యా, డాకటేరుబాబూ. సొమ్మిచ్చాగా? ఇంకా అనుమానమేటి? కసింత ఎనకా ముందులుంటాయ్ యవ్వారాలకి. అందుకని యవారం [illegible] ఎగిరెళ్లిపోయే పేణాన్ని, పోతే పోనియ్ అంటావా? ... ఊఁ, కానియ్! ... సీమూ నెత్తురూ ఉన్నో డెవడూ అలాగనడు. అలా సూత్తావేం? నాకు సిరెత్తుకొచ్చిందంటే నా నసలు మంచిదాన్నిగాను. అన్నకాడి కిచ్చాక ఇంకా జాగారమెందుకు? పిలగాడికి సూదెయ్యి" అంటూ గద్దించింది ఇంచుమించుగా అప్పలమ్మ.

ఏదో లోకంనుంచి ఊడిపడ్డట్టు డాక్టరు తుళ్లిపడి మెడిసిన్ చెస్ట్ తెరిచాడు. తన పనిలో తాను నిమగ్నుడయ్యాడు.

ఉపన్యాసం దంచేస్తూంది అప్పలమ్మ. "అవునయ్యా, సత్తిబాబూ, నేనేమన్నా రాకాసిననుకున్నావా గణాసారి ననుకున్నావా? పిలగాడికి పేణం మీదికొస్తే నీ సొమ్ము వాడేశానని చెబితే పోలా? అబద్ధాలుకూడానా? జీతం డబ్బులు చేతి కందలేదంటావా? ఇంత ఇరకాటంలో పడ్డాను, నీ సొమ్ము ఇవ్వలేను అండానికి సిగ్గేసిందా? నీ సిగ్గు సట్టుబండలుగానూ. అబద్ధమాడ్డానికి సిగ్గెయ్యలే? మాంచి బలేవోడివయ్యా. సమయానికి నాను రాపోతే ఆ బాబు కనికరించేవోడా? పిలగాడు మనకి దక్కేటోడా? ... పోనీలే, అయిందేదో అయ్యే పోయింది. అదీ మంచికేలే. నువ్వా అబద్ధమాడక పోతే నా కా కోపమూ రాకపోను. నే నిటికేసి రాకనే పోదును. . . నువ్వన్నా తాయారమ్మా, మాటవొరసకి పిలగాడికి బాగాలేదని జెప్పా? ... అవునయ్యా ఇంతోటి సొమ్ముకి నువ్వేం పారిపోతావనుకుంటానా? నాకు బయపడి కాబూలోడి దగ్గరకెల్తావా? అంతేలే, మీరకం మడుసులంతా అంతే. నిజం చెప్పరు. అందుకే నాకు మంట! ... సూడు, సూడు, సంటోడు కదిల్నట్టుండాడు... ఏటా పళ్లా బిగించాడు? ... ఓర్నిఇంట పటారంగానూ, సందయ్యా, సంది. తెల్లారి నేనొచ్చినప్పుడు ఒక్కమాట జెపితే ఈ తగువే నేకపోనే! సుట్టు ముట్టించి మెడమీా దంటింతే ఈపాటికి తగ్గేపోను! ... బలే డాకటేరువయ్యా! ఈపాటి మాయరోగానికి మూడు పాతికలు గుంజావా? నాకు ముందే దెలిసిందిగాదు ... నువ్వూరుకో, తాయారమ్మా, పిలగాడి కేటీగాదు ... అవునయ్యా, సత్తిబాబూ, సంది లచ్చనాలన్నా పోల్చుకోనేకపోనావా? మంచి బాగాజేశారు! మీ తెలివి తెల్లారినట్టే ఉంది."

"మరేం భయంలేదు" అంటూ లేచాడు డాక్టర్.

"ఆ మాట నాకు ముందే దెల్సులేవయ్యా" అంది చటుక్కున అప్పలమ్మ.

"అప్పలమ్మా! నీ ఋణమెలా తీర్చుకోగలనో" అని గద్గదంగా పలికాడు సత్తిబాబు.

"ముండాబాగ్గెం. ఈపాటిదానికే!" అని తీసి పారేసుకుంది తన ఘనత తాను.


"మిస్టర్, సత్యారావ్? ఎవరీమె?"

"నానెవరైతే నీ కెందుకు? నీ పైసలు నీ కందాయిగా." కసిరేసింది అప్పలమ్మ.

"శాంతించు, అప్పలమ్మా. పెద్దోళ్లతో అట్లా మాట్లాడచ్చా? ఈమేనండి, ఇందాకా చెప్పానే పాలమ్మని. ఆమే అప్పలమ్మ."

కోపంతో తుమ్మల్లో పొద్దుగూకినట్టుంది అప్పలమ్మ ముఖం.

"ఐ సీ" అంటూ డాక్టర్ మెడిసిన్ చెస్ట్ మూసి



మూషిక వాహనుడు

చిత్రం — ఆయాన్య (గుంటూరు—2)

బయటికి నడవడానికి ఉపక్రమించాడు.

"డాక్టర్, డబ్బు వదిలేశారు" అన్నాడు స్టూలు మీదున్న డబ్బు చూపెడుతూ సత్యారావు.

"దట్స్ ట్రూ" అంటూ జేబులోకి చెయ్యి పోనిచ్చి మరో పాతిక రూపాయలు ఆ స్టూలుమీద పెట్టేసి చకచకా వెళ్లిపోయాడు డాక్టరు. . పోతూ, పోతూ "అవసరం పడితే వెంటనే రండి. సాధారణంగా అవసరం పడదు" అంటూ వెళ్లాడు.

ఆశ్చర్యపోయి చూస్తున్నారు ఆ దంపతులు.

"ఏ టలా ఇదయిపోతారు? అందులో ఇంతేమీ నేదు. ఆ బాబుకి తెలిసొచ్చింది" అంటూంది అప్పలమ్మ.

డెబ్బై అయిదు రూపాయలూ తీసి అప్పలమ్మ చేతిలోపెట్టి దణ్ణంపెట్టాడు సత్యారావు.

"పిచ్చోడా, నీ అవసరానికో పదేనురూపాయలుంచుకోవయ్యా, తరవాత చూసుకుందాంలే" అంటూ పదిహేను రూపాయలు స్టూలుమీద వదిలేసి తాదీగా ఏమీ జరగనట్టే అసిరమ్మను మరిపిస్తూనే వెళ్లిపోయింది అప్పలమ్మ.

కనుమరుగయ్యేవరకూ అప్పలమ్మనే చూస్తూ ఉండిపోయా రా దంపతులు. ఎన్నడూ కనిపించని కరుణామూర్తి నాట్యంచేస్తూ వెళుతున్నట్టు వారి కళ్లకు గోచరించింది అప్పలమ్మ. ★